

# పాపం!... పంతులు!

రైలు వచ్చి ప్లాటుఫారంమీద ఆగింది. రైలు ఆగీ ఆగటంతోటే ఎవరిమటుకు వారే ముందసిగా ఎక్కి లోపల పడాలనే తాపత్రయంలో ఉన్నారు. రైల్లో జనం సరేసరి! కిటకిటలాడిపోతున్నారు. మనుష్యులనికూడా కాలీలాగ లెక్కపెట్టి చూసుకుని అంతా రైల్లో ప్రవేశించినది, లేనిది తేలటంలేదు ఎవరికీను... రైల్లోకి ఎక్కేవాళ్ళేగాని, రైల్లోంచి దిగేవాళ్లు అసలు ఉన్నట్టేలేదు. ముందుగా రైలు ఎక్కగలిగినవాళ్ళు, తరువాత రావాలని ప్రయత్నించేవాళ్ళని యథాశక్తి నిరుత్సాహతోచినంతమట్టుకు వాళ్ళు ఏదో ఒకమాట అంటూనే ఉన్నారు.

“అబ్బబ్బ! ఎందుకయ్యా! అలాగ గెంటుతుంటూ యాతనపడతారు? అందరూ ఒకచోటే ఎక్కాలా? వెనక పెట్టెలన్నీ ఖాళీనే అయినా అటువేపు ఒక్కరూ పోరు. అంతా

అన్నాడొకాయన - గేటుదగ్గిర జనాన్ని మోచేతుల్తో ఇటూ అటూ లోపలికి నెర్దు కుంటూ ఆజనం మధ్యనపడి నలుగుతూ.

"అలాగా? అయితే పాపంమీరు ఈ గేటు దగ్గిరే నిలబడిఉన్నారేం? - అవస్థలు పడు తూను?...నిక్షేపంలాగ ఖాళీగాఉన్న వెనక పెట్టెలోకి వెళ్ళరే?..." అని అడిగాడు ఆపెట్టెలోకి ప్రవేశించాలని ప్రయత్నిస్తున్న మరొకాయన.

అంతటితో ఆ మొదటివ్యక్తి ముఖం కళా విహీనం అయిపోయింది. ఇక ఆయన మౌన వ్రతం పట్టాడు.

"ఈ పెట్టెలో ఖాళీలేదండి! - అయ్యో!- ఖాళీ లేదంటే వినరేం? - ఏమిటి? - ఆ తోసు కునిరావటం?...నీకొక్కడుటయ్యా చెప్పేది? ఖాళీ లేదని చెప్తూంటే వినవేం? నాకే చోటు లేక ఇక్కడే నిలబడిఉంటే నువ్వెక్కడికి? ..."అన్నాడు మరొక పెట్టె గేటుదగ్గిర ఖంగోడాయించుకునుంచున్న వ్యక్తి.

అయితే ఈమాటలనేమీ లెక్కచెయ్య కుండా లోపలకి గెంటుకువెళ్తున్న మరొకడు, "ఎంతమాటన్నారు? తమంతటివారే నుంచుని ఉంటే ఇక మాలాంటివాళ్లు కూచోవాలని అనుకుంటాం గనకనా? ఏదో మీలాగే కాస్త నుంచుని రెండునిమిషాలు కళ్ళు మూసుకున్నామంటే ప్రయాణం అయి పోతుంది. బాధేముంది?" అని లోపలికి వెళ్ళి సుఖాసీనుడయాడు. ఆయన వెనకాలే మరో పదిమంది లోపల ప్రవేశించారు. వీరందరూ కలిసి గేటుదగ్గిర వ్యక్తిని లోపలికి గెంటే శారు. ఆయనముఖం వెలవెలపోగా అదోక మోస్తరుగా చూడటం ప్రారంభించాడు.

మరొక పెట్టెలోనివాళ్లు గేటు మూసేసి, గేటుకడ్డంగా సామానుపేర్చి, ఎవరొచ్చినా తలుపు తియ్యకుండా "ఇంకా ఎక్కడి కయ్యా? - అసలు తలుపు తీసేందుకేనా లేందే?..." అని ఒకరు "ఏమిటో జబర్దస్తీ! వెళ్లు. ఈపాటికిఇంకొక పెట్టెచూసుకో!..." అని ఇంకొకరు, "మనంచెప్తే వింటారేమిటి లే! వాళ్ళకి తెలియదు!...చెప్పేవినరు!..ఇదేబాధ! అని ఇంకొకరు, "సరెలెండి! మనకెందుకు? లోపలకి తొంగిచూసి ఆయనే వెడతాడులే?" అని వేరొకరు...ఇలాగ అంటూండగా కొందరు కుర్రాళ్ళు కిటికీలలోంచి పైకెగ బ్రాకి పెట్టెల్లో పడ్డారు. ఇంతవరకూ స్థిమితంగా లోపల కూచుని కబుర్లు చెప్పిన పెద్దలు తెల్లబోయి చూస్తుండగానే వాళ్ళంతా ఆ సామాను గేటుదగ్గిరనుంచి లాగి, గేటు తెరచి, జనాన్ని లోపలికి ఆహ్వానిస్తున్నారు. గత్యంతరం లేక లోపల వారు మాట్లాడకుండా ఊరుకున్నారు.

రైలు ఇంజనుదగ్గిరనుంచి గార్డు పెట్టె వరకూ రెండు మూడుసార్లు తిరిగి వచ్చిన రఘుపతికి అన్ని పెట్టెలూ ఒకలాగే ఉన్నాయి. ఏవిధమైన పేచీ పూచీలు లేకుండా, తను పెట్టెలో ప్రవేశించేసరికి తనకోసమే వున్నట్టు ఒక సీటు ఖాళీగా ఉంటే, ఒకరి జోలీ, శొంఠి అక్కర్లేని వాడి లాగ, చాలా చాలా బుద్ధిమంతుడిలాగ తను ఆ సీటులో కూచుని ప్రయాణం చెయ్యటానికి ఎంతో ఇష్టపడతాడు - రఘుపతి... కాని, ఇవాళ రైలంతా వెదికినా కూడా ఒక్కచోటా అలాగలేదు. అందుకు చాలా బాధపడ్డాడు. ఇంతట్లోకి రైలుకి గంట కొట్టారు. గార్డు ఈలవేసి పచ్చజెండా చూపెటాడు. రైలుకూత కూసింది. తీరా రైలు బయలుదేరాక కదిలే రైలు ఎక్కటం తనకి చాలా అయిష్టం గనక ఎలాగో తన మనస్సుకి సరిపెట్టుకుని, ఇంకా రైలు కదలక పూర్వమే ఎదురుగా ఉన్న పెట్టెలోకి ప్రవేశించాడు. అతనూ రైలుపెట్టెలో అలా అడుగుపెట్టాడో, లేదో ఆ రైలూ స్టేషను వదిలింది. అక్కడికి తను అదృష్టవంతుడే నని తనని తనే చాలాసార్లు అభినందించు కున్నాడు.

హడావుడిగా రైల్లో ప్రవేశించటం వల్లను, అంతకుముందే ఆ పెట్టెలో క్రిక్కిరిసి జనం ఉండటంవలను రఘుపతి చంకను ఉన్న గొడుగు ఎవరికో తగిలింది. వెంటనే ఆయన "ఏమండోయ్! మేస్టారూ? కాస్త ఆ గొడుగు చంకను తీసి చేత్తో పట్టు కుందురూ? వెనకాల వాళ్ళకి ఒళ్ళు హూనమయిపోతోంది!..." అన్నాడు.

"చిత్తం, చిత్తం" అంటూ తల పంకించి, గొడుగు చేతో పట్టుకుని, జేబు ఒకసారి తడిమిచూసుకుని, టిక్కట్టు పైకి తీసి, కళ్ళారా చూసి, జేబులో పెట్టుకుని, ఒక చేత్తో జేబుపట్టుకుని నుంచున్నాడు - ఎందుకేనా మంచిదని...

ఐదునిమిషాలు తిరక్కుండానే రైలు తరువాతి స్టేషనులో ఆగింది. ఒకరితరువాత ఒకరుగా ఆ పెట్టెలోంచి చాలామంది దిగి పోయారు. ఇదే అదునుకుని, ఖాళీయైన జాగాలో ఒకచోట భద్రంగా కూచుని, తన గొడుగు, చేతిసంచీ బెంచీమీదే తనకి దగ్గరగా పెట్టుకుని మనస్సుని కుదుటపరుచు కున్నాడు రఘుపతి.

తను కూచున్న పెట్టెనంతనీ ఒక్కసారి పరికించి చూశాడు రఘుపతి. అందులో జనం బాగానే ఉన్నారు. కాని ఇరుకుగా మాత్రం లేదు. కూచున్నవాళ్ళకి ఖాళీ బాగానే ఉంది. తగుమాత్రపు జనం ఉన్నారు.

ఇలాగ అనుకుని సంబర పడ్డంతసేపు పట లేదు - దిగినవారికి రెట్టింపుమంది ఎక్కి కూచున్నారు. కూచున్నారంటే సుఖాసీను లయ్యారని కాదు. మళ్ళా బోలెడంత మంది జొరబడ్డారు - ఆ పెట్టెలోకి.

"ఏదో ఒహ పెట్టె ఎక్కండయ్యా! ఇంకా ఇక్కడనయం! అదుగో - ఆముందు పెట్టెలో జనం తలుపులు బిడాయించుకు, ఛస్తున్నారు..." అని తనకుగల అక్కసంతా తీర్చుకుంటూ అరుస్తూ, ఒగురుస్తూ జనాన్ని గెంటుకుంటూ జొరబడ్డాడు ఒక బట్టతల ఆసామీ.

అతడు లోపలకివచ్చి రావటంతోటే అంతకుముందే లోపలకివచ్చి కూచునేందుకు చోటులేక నుంచుని ఉన్న లావుబాటి వ్యక్తిని అనుకోకుండానే గెంటాడు. ఆ ఊపుకి ఆలావు బాటివ్యక్తి తూలి తనకిసమీపంలోనే ఉన్న ఒక ట్రంకు పెట్టెమీద కూలబడ్డాడు.

"అయ్యో! అయ్యో! అదేమిటి? అందరు కూచుంటే ఇంక ఆ పెట్టె ఉంటుందిటండీ? అలా చూస్తో కూచుంటారేం? ఆ పెట్టెమీదనించి లేవమనండీ? - మీకే నండీ! - చెప్తోంటూ?...అలా చూస్తో కూచుంటారేం?..." అంది ఒక ఇల్లాలు భర్తతో.

"అదే - చూస్తున్నా!..." అన్నాడు ఆ భర్త.

"మీరు అల్లాగే చూస్తూ కూర్చోండి! ఈలోగా అదెలాగూ అప్పడమయిపోతుంది! ..."అంది ఆవిడ ఆలావుబాటి ఆయన్ని సాభిప్రాయంగా చూస్తూ - తన భర్తనుద్దేశించి.

"అయ్యో! అంత అఘాయిత్యం చేసేస్తున్నారేమిటి? అంతమాత్రానికే అప్పడమయిపోతుందా?..." అన్నాడు లావుబాటి ఆయన.

"ఓ మోస్తరు బరువయితే నా!..." అంది ఒక కంఠం వెనుకనుంచి.

దాంతో అంతా ఘొల్లుమని నవ్వారు.



# ★ దగాపడిన తమ్ముడు ★

(43-వ పేజీ తరువాయి)

గవర్నమెంటోడు కావాల. ఆడే మనకి తల్లీ తండ్రీ! ఆడే మనలాంటిబీదోళ్ళకి గొప్పోలు సూసినట్లు సెయ్యకపోతే మనం నీతిగా యెలాగ బతుకుతాం అన్నా?"

"మన గవుర్నమెంటుని అనక ఆడు సిన్నోడు. అంతా యెంతకని సూసాడు."

"నివ్వు యింకా పట్నంసంగతి తెలుసుకోలేదన్నా. మన సిన్నతనాన మన అయ్యలకి అన్నం బట్టావుంటేసరి! ఇప్పుడో కార్లు గీర్లు వచ్చినాయా! ప్రతివోడికి ఆశకి అంతు లేకుండాపోతోంది. కడుపునిండితే సాలదు కారు కావాల-కోరికలు యెక్కువౌతున్న కొద్దీ మనిషిలో మంచి సచ్చిపోతాది. అలాంటి వున్నోడు, లేనోడుమీద సెలాయిస్తాడు! ఆడికి కారు-యీడికి ఆకలి."

"ఈడికీ కారు కావాలంటావా?"

"నివ్వు నాతల్లీ తండ్రివి-ఆడికి కారుండనీ-యీడికి ఆకలి లేకుండా సెయ్యి. ఈడు ఆశ తక్కువోడు. యీడిలోనే మంచెక్కువుంటాది. ఈడే దేనికయినా నడుం కట్టుకోని నిలబడ్తాడు. అలా నిలబడినోలున్న లోకమే లోకం."

"అయితే గవుర్నమెంటోడు యెందుకు సెయ్యడూ అని..."

"అదేనన్నా! ఆడు గుడ్డోడు అయితేనే మనలాంటోలకి బాధ! ఆనాడు రాములవారు యేం సేసినారు? మారాజు సాకలోడి మాటంటే ఏమిటి? ఆడి దగ్గరకూడా జడిసి మాతల్లి సీతమ్మని అడివికి పంపించినాడే—అన్నా అలాంటి రాజరికం వస్తే యీ గంజి నీరు తాగినా మనలాంటోలికి అమృతం తాగినట్టుంటాది!"

"నిజమేనన్నా—అలాంటి మారాజు మరి పుట్టాడా?"

"ఆ తండ్రి లంకనుంచి వచ్చి యేం చేసినాడు? ఇప్పటిలాగే ఎందరో బాగా డబ్బు సేసుకుంటే ఆ మారాజు కొట్టనేదు తిట్టనేదు. ఆంజనేయులవారిని పెట్టి గుమ్మడి పండంత డబ్బంటూ గాదెడు డబ్బు తీసుకుని లేనిజవాన్ని సుఖపెట్టాడు. అలాగే గవుర్నమెంటోడు బ్లాకులో దొంగ లెక్కలతో కోట్లు గడించిన యీలందరికీ సేస్తే మనలాంటోలకి పనిదొరకదా?"

"మావూర్లో యేమైనాది? గరిశెలు పండించిన రాజిగాడికి పాక్యూరిమెంట్ తక్కువ. వాడు యెక్కువ! పైనున్నోడు మంచోడేనన్నా-మధ్యనున్నోలే అంతా సేసన్నారు-యీలలో నాయం వుంటే మనకీగతి యెలా వస్తాది?"

పుల్లయ్య చెప్పిన మాటలకు ఆ అన్న కాదనలేక పోయాడు.

"అన్నా లోకం యిలాగున్నాది. మనం లోకానికి తగి నడుసుకుంటేగానీ బతకలేం-మళ్ళీ పెజల్లో మనిసిననే పౌరుషం తెప్పించి నాయం సుప్పించిన మారాజు పుట్టాల—ఆ నాటిదాక బతక్క సచ్చిపోతామా? నా మాట యిను. ఆకలితో నివ్వూ పిల్లాజెల్లా సచ్చిపోకండి—రాత్రుళ్ళు వచ్చావంటె"

"దేనికి?" — పుల్లయ్య సంశయంగా సూసాడు. నీతిని నూటికి నూరుపాళ్లూ గౌరవిస్తున్న పుల్లయ్య వేపు చూసి ఆ అన్న నవ్వి 'దొంగతనానికి కాదు నే—రాత్రుళ్ళు రేవులోన గోధుమ ఓడలు దించాల-ఇప్పుడా మీ వూరు వెళ్లలేవు-గడించుకో-తిను బతుకు-డబ్బు సేసుకొని మళ్లా వూరు వెళిపో!"

పుల్లయ్య ఆశ్చర్యంగా "అంతడబ్బు దొరుకుతాదా?" అన్నాడు.

"ఆ మీదున్న కష్టాను కనికరించాడంటే వందలే దొరుకుతాయి! నశీబుబాగుంటే, వేలే వసాయి. రేపు రాత్రికి యీవేళకి యిక్కడే వుంటాను. వస్తావుకదూ-ఒక్కడివే రావాల!"

"ఈడు వసల్లు!"

"బతకాలంటే ఒదిలించుకోవాల—"

పుల్లయ్య శెలవుతీసుకొని సంతోషంగా వెళ్ళిపోయాడు. పెళ్లంతో "ఈనాటికి మన కష్టాలు తీరిపోయినాయి," అన్నాడు, "రేపురాత్రినుంచీ ఓడపని-మనం తినగా ఒకరికి పెట్టగా యింకా మిగిలించావంటే మళ్లా మనవూరు వెళ్ళిపోమా?" అని ఆనందంతో యెగురుతుంటే నీలి "గాలిలో మేడలు కట్టుకు-గడించుకున్నదాంతో కడుపునిండితే సాలదా?" అంది.

పుల్లయ్యకు తొలిసారి యీవూరువచ్చాక హాయిగా నిద్దరపట్టింది. ★

—ఇంకావుంది.]

# ★ పాపం! పంతులు! ★

(23-వ పేజీ తరువాయి)

వాళ్లనెందుకు అనుకోవటం?...వాళ్లు లోకువనా?" అన్నాడు లావుపాటి ఆయన.

"లోకువేముంది? ఉన్నమాటేఅన్నాను" అన్నాడు బట్టతల వ్యక్తి.

"ఉన్నమాట కాదు...నువ్వు అనుకున్న మాట! అంతకంటె ఇంకేమీ లేదు ... మీకు పిల్లలున్నారా—బళ్ళో చదువుకుంటున్న వాళ్ళు?..." అని లావుపాటి ఆయన అడిగాడు...

"ఏం? ఉన్నారు!..." అన్నాడు బట్టతల వ్యక్తి తడబడుతూ.

"బళ్ళోవేసిన తర్వాత మీ అబ్బాయి సరిగ్గా బడికివెడుతున్నాడో, లేదో; చదువుతున్నాడో, లేదో ఏనాడైనా కనుక్కున్నారా?..."

"అబ్బే! లేదు! అయినా మేష్టరున్నారుగా! ఇంకా మనమేం కనుక్కుంటాం?"

"అదుగో! అందులోనే ఉంది!... వాళ్ళు ఎన్నని చూస్తారు?... ఇదివరకు తల్లి దండ్రులు ఇలాగే ఉండేవారా?..."




# ★ పాపం! పంతులు! ★

అని సూటిగా అడిగాడు లావుబాటి ఆయన.

ఇదంతా వింటున్న రఘుపతికి ఒళ్ళు మండిపోతోంది. పాపం! ఆ లావుబాటి ఆయన ఉన్నాడు గనక సరిపోయింది! శాస్త్ర మంచీ చెడూ ఆలోచించి మరీ మాట్లాడుతున్నాడు. లేకపోతే ఈ బట్టతలాయన మరీ పేట్రేగిపోను! అయినా, ఈయనగారికి అవసరం, అనవసరం అంటూ అసలు ఉండవు కాబోలు! తనకితోచినదల్లా అనేస్తుంటాడు. అయినా, బొత్తిగా రోజులిలా తయారయి పోయాయి. పొట్టకోస్తే అక్షరంముక్క రాకపోయినాగాని, ప్రతీ వ్యక్తికి విద్యావిధానంమీద ఉపాధ్యాయుల మీద తమ ఇష్టంవచ్చినట్టు మాట్లాడే అవకాశం ఏర్పడిపోయింది! అసలు నిజం చెప్పాలంటే, విద్యావిధానం గురించి ఏ మాత్రమూ తెలియనివాళ్ళంతా దాన్ని గురించి ఉపన్యాసాలివ్వటం మొదలుపెట్టాకే అది ఇలాగ పాడయిపోయింది — అనుకున్నాడు రఘుపతి.





ఒకే గ్యాలను పెయింటు చాల భాగములకు సరిపోవును

*ఇంచుమించుగా ఎటువంటి ప్రదేశమునైనా లోతట్టు బయట పూయవచ్చును.*

**SHALIMAR PAINT, COLOUR & VARNISH CO., PRIVATE LTD.**

CALCUTTA • BOMBAY • MADRAS • NEW DELHI • KANPUR


అయితే, ఈమాటలు పైకి అనేందుకు ధైర్యం చాల్లేదు. మొదట అయితే అనేసు నేమోగాని, లావుబాటి ఆయన మాట్లాడిన తర్వాత తను మాట్లాడటం చాలా అనవసరంగా కనిపించింది! అంతేకాదు! చాలా మంచిదయింది కూడా!...ఆ మాటలన్నీ ఆ లావుబాటి ఆయన అన్నాడు గనుక బట్టతల వ్యక్తి నక్కిన పేనలే పడిఉన్నాడు గాని, అదే తనయినట్లయితే ఒంటికాలిమీద లేచేవాడు. అంతకంటె అదృష్టం తను ఉపాధ్యాయవృత్తిలో ఉన్న విషయం ఆ బట్టతలాయనకి తెలియకపోవటం!......అదే గనుక తెలిసిఉన్నట్లయితే ఇంతవరకూ పరోక్షంగా ఉపాధ్యాయులమీద సాగిస్తున్న యుద్ధం ప్రత్యక్షంగా తనమీదనే సాగించేవాడు ఇప్పుడు......అని మనస్సుకి నచ్చజెప్పుకున్నాడు రఘుపతి.

తను 'ఫలానా' ఉద్యోగం చేస్తున్నట్టు చెప్పుకోటానికి సిగ్గుపడవలసి వచ్చినందుకు ఎంతో బాధపడ్డాడు రఘుపతి.

అందుకే మొదటినుంచీ ఈ ఉద్యోగమంటే విముఖంగానే ఉండిపోయాడు రఘుపతి. ఇందులో ఉండే సాధకబాధకాలు, కష్టసుఖాలు అన్నీ మొదటే గ్రహించాడు. అందుకనే చదువు పూర్తికాగానే ఏదిమంచీ మేష్టరుగా జేరమంటే జేరనని మొరాయించుకుని కూచున్నాడు. ఇది చాలా పవిత్రమైన వృత్తి అనీ, విద్యాదానంకంటె ఘనమైన దానం మరొకటి లేదనీ అందరూ నచ్చజెప్పబోయినా తను లొంగలేదు...కాని, చిట్టచివరకు పరిస్థితుల ప్రోద్బలంవల్ల ఈ వృత్తిలో ప్రవేశించక తప్పలేదు. ప్రవేశించిన తర్వాత ఇదివరకు తనకున్న అభిప్రాయాలు దృఢతరమయాయే గాని, మారలేదు.

పెట్టెలో వాళ్ళంతా ఒక్కసారి విరగబడి నవ్వటంతో రఘుపతి ఆలోచనలు వదలి ప్రపంచంలో పడ్డాడు. అయితే వాళ్ళెందుకు నవ్వారో అంతుచిక్కలేదు. ఎవరినేనా అడుగుదామంటే దానివల్ల ఎటువంటి ప్రమాదాలు రానైయున్నాయోనని భయపడ్డాడు.

"ఏది? ఇంకొక్కసారి చెప్పండి! ఇందాకా సరిగ్గా వినలేదు!..."అని అడిగాడొక ప్రయాణీకుడు బట్టతలవ్యక్తిని—నాటకంలో 'వన్సుమోర్'లాగ...

"ఆఁ! ఏముందండీ! మేష్టరికి తీరుబడి ఎక్కువ గనుక పిల్లలు ఎక్కువగా పుడతారు. మీకు ఈ విషయంలో ఏమైనా అనుమానాలుంటే చెప్పండి! నిదర్శనాలు లక్ష

...కి ఎత్తులు చూపిస్తాను..." అన్నాడు బట్టతలాయన.

అంతా గొల్లుమని నవ్వారు. రఘుపతికి గుండె గతుక్కుమంది.

"రైలెక్కినప్పటినుంచి మీరు చెప్పిన మాటలోకల్లా ఇది ఒక్కటే నిజం!..." అన్నాడు లావుపాటి ఆయన.

"అవునవును! క్వైట్ రైట్ !..." అని ఆ అభిప్రాయాన్ని బలపరిచాడు మరో ప్రయాణీకుడు.

అంతా ఏకాభిప్రాయాని కొచ్చినట్టుగా ఉంది.

"నేను అబద్ధం ఎందుకు చెప్తానండీ.?.." అన్నాడు ధైర్యం పెరిగిన బట్టతల వ్యక్తి.

హారి! వీడి తస్సాదియ్యా! వీడు చాలా అసాధ్యుడిలాగున్నాడే?... మేష్టర్లనిగురించి సిద్ధాంతీకరించేస్తున్నాడు. ఇంకొక్క క్షణం ఆగితే తన విషయం యావత్తూ కూపీలాగేసి తననే ఆ సిద్ధాంతానికి బలం చేకూర్చేందుకు కావలసిన నిదర్శనంలాగ వాడుకుని తీరతాడు... తను రైలెక్కిన తర్వాత ఇప్పటివరకూ అనవసరంగా మాట్లాడకుండా ఉన్నందుకు, తానెవరో ఆ బట్టతల వ్యక్తికి తెలియపర్చకుండా ఉన్నందుకు తనని తనే అభినందించుకున్నాడు రఘుపతి.

అసలే ఇష్టంలేక చేస్తున్న ఉద్యోగం! అందులోనూ అందరూ నీరసభావంతో చూసేది!... అందువల్లనే రఘుపతి ఎవరేనా తనని "పంతులుగారూ!" అని పిలిస్తే చాలా బాధపడతాడు. అసలు ఆ పిలుపు వినగానే ఉలిక్కిపడతాడుకూడా!. అందుచేత ఈ బట్టతల వాడి బారిని పడక ముందే తను రైలు దిగిపోతే బాగుండునను కున్నాడు. అనుకుని అప్పుడే దాటిన స్టేష నేమిటో కనుక్కోగా, తరువాతిదే తాను దిగవలసిన స్టేషనని తేలింది. దాంతో కాస్త మనస్సు కుదుటపడింది రఘుపతికి.

కాని ఆ బట్టతలవాడు రఘుపతిని వదల దల్చుకోలేదు. "ఏం? పంతులుగారు! ఇందరూ ఇన్ని మాట్లాడుతున్నాగాని, మీరు పలక్కుండానే కూచుని వున్నారు! మీ అభిప్రాయం ఏమిటి?..." అని అడిగాడు.

రఘుపతి అనుకున్నంతా అయింది. కాని నిభాయించుకుని, "ఆఁ!... దేన్ని గురించి?..." అన్నాడు ఏమీ ఎరగనట్టు!..."

"అదేనండి! మేష్టర్లకి పిల్లలు ఎక్కువ పుడతారన్నానే! దాన్ని గురించి..." అని వివరించాడు బట్టతల వ్యక్తి- జవాబుకోసం రఘుపతి ముఖంలోకి పరీక్షగా చూస్తూ.

"నా అభిప్రాయం ఏముంది?- మీరు చెప్పారుగా! ఇంక నేనేం చెప్తాను?..." అంటూ నీళ్ళు నమిలాడు రఘుపతి.

"పంతులుగారు వానుస్తున్నారు.. కొంప దీసి స్వానుభవం కాదుగదా?..." అన్నాడు వికటంగా నవ్వుతూ బట్టతలాయన.

"హారి! పిడుగా! అనేశావూ- ఆ కాస్త మాటా? సరేలే!..." అని లోపలే అనుకున్నాడు- తనకి ఇప్పటికే పదిమంది పిల్లలనీ వీడికి ఎలాగ తెలిసిందా?-అని ఆలోచిస్తూ.

ఇహనైనా తను దిగవలసిన స్టేషనువెంటనే వచ్చేలాగు చెయ్యమని వెయ్యిదేవుళ్ళకి మొక్కాడు- మనస్సులోనే...

భగవత్కృపవల్ల ఆస్టేషనురానేవచ్చింది.. వెంటనే లేచిగొడుగు చంకన బెట్టుకుని, సంచీ చేత్తో పట్టుకుని వడిగాదిగపోయాడురఘుపతి.

ఇంతలోకీ, ఆ పెట్టెలోకే ఎక్కబోతున్న విద్యార్థి ఒకడు "మేష్టారూ! నమస్కారమండీ!..." అన్నాడు రఘుపతి నుద్దేశించి..

రఘుపతి ప్రతినమస్కారంచేసి బట్టతలాయనకేసి ఖంగారుగా చూశాడు.

ఆయన ఈ సంభాషణ విన్నట్టున్నాడు. నవ్వుతున్నాడు. శిష్యుడు నమస్కరించినదుకు సంతోషించినా,అటువంటప్పుడుతటస్థపడ్డందుకు విసుక్కున్నాడు-లోపలే!...

"ఏం పంతులుగారూ?... దిగిపోతున్నారా?..." అన్నాడు బట్టతల వ్యక్తి వెనకనించి.

"మరేనండీ!..." అని అస్పష్టంగా గొణిగి జనసమూహంలో కలిసిపోయాడు రఘుపతి. ★



సినీతార జమున
—[ట్రిక్ ఫోటో: గిరిధర్]

## మాచ్‌ఖండ్ చూసిరండి

[35 వ పేజీ తరువాయి]

నీళ్ళు నిలవచేస్తారు.

రాత్రి బంగళాముందు కుర్చీలువేసుకు కూర్చున్నాం మేం. గ్రుడ్డివెన్నెల, మిణుకు మిణుకుమనే నక్షత్రాలు. ఆ నిశ్శబ్దంలో వ్యక్తీకరించలేనిభావాలు జనిస్తాయి. ముందు భాగంలో ఇంజనీరుగారి యిళ్ళు అవీ వున్నాయి. ఈ బంగళాలన్నీ కాంప్‌కి ఒక వైపు చిన్నఎత్తైన కొండమీద కట్టారు. కొండమీదనుంచిచూస్తే, లైట్లలో కేంప్ సుందరంగావుంటుంది. కాంప్ చుట్టూ కొండలు ఆ కొండలమధ్య మిలమిల మెరుస్తూన్నది. కొండలమధ్య వుదయించే చంద్రుడు. ఎంతో మనోహరంగా వుంటుంది ఆదృశ్యం.

ఉదయాన్నే లేచి నేను కిటికీలోంచి రెండోవైపు చూసేదాన్ని, ఈ కొండకి ప్రక్కనే మరో రెండు కొండలున్నాయి. ఆ కొండలమధ్య లోయలో అరకు వాలీ కోయవాళ్లు భూమిదున్ని సాగుచేస్తున్నారు. ఎత్తుమీదనించి చూస్తే లిల్లీపుట్ మనుషుల్లా, కొన్ని బొమ్మలు పని చేస్తున్నట్టు కనిపించేది. ఎంతసేపు చూసినా ఆ కిటికీ దగ్గర నుంచి కదల బుద్ధి వేసేదికాదు.

సాయంత్రం కొండదిగి మనం నది వద్దకు పోవచ్చు. మాచ్‌ఖండ్ ఏవో మధుర స్మృతులని కలిగిస్తుంది. ★